TGTEL/26/A0372

# మన మహతి న్యూస్
## తెలుగు దిన పత్రిక

ఎడిటర్ :డాక్టర్. ప్రకాష్ జాదవ్ | బుధవారం మే 13, 2026 | సంపుటి : 01 | సంచిక : 104 | పేజీలు 5 | వెల-2/- | MANAMAHATINEWS.COM



# ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం సహించం

## సజావుగా వరి, మొక్కజొన్న కొనుగోళ్లు



- ధాన్యం వెంటనే లారీల్లో తరలించాల్సిందే
- అవసరమైతే పోలీస్ సాయంతో ధాన్యం సేకరణ
- లారీలు పంపకుంటే క్రిమినల్ కేసులు పెట్టండి
- కలెక్టర్లకు సిఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు

**హైదరాబాద్,మే12 :**
ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఉపేక్షించొద్దని.. అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులకు వెనకాడవద్దని ముఖ్యమంత్రి ఆదేశించారు. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగొద్దని తెలిపారు. అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని సూచించారు. మంగళవారం.. జిల్లా కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోలు, వరి ధాన్యం సేకరణపై జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సీఎం ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని.. గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటి కప్పుడు గోడౌన్స్‌కు తరలించాలని అన్నారు.

మిగతాది 2లో



# జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండోవిడుత పంపిణీ

- రెండోవిడతపై 21న కేబినేట్‌లో ఖరారు చేస్తాం
- స్పెషల్ డ్రైవ్ ద్వారా డబుల్ ఇళ్లు పంపిణీ
- అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,మే12 :**
రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత పంపిణీ ప్రారంభించనున్నట్లు తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ఆదిలాబాద్‌లో ప్రారంభిస్తామని చెప్పారు. మంగళవారం గృహనిర్మాణశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల విధివిధానాలను ఈనెల 21న జరిగే మంత్రివర్గ సమావేశంలో ఖరారు చేస్తామని పొంగులేటి చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం స్థలాలు గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. హైదరాబాద్‌లో స్థలాలు ఉన్నవారికి ఈ నెలాఖరులోపు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రాష్ట్రంలో పేదల సొంత ఇంటి కలను సాకారం చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొలిక్కి వచ్చిన నేపథ్యంలో సీఎం రేవంత్ సూచన మేరకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2 వ తేదీన ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడతను లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై ఈ నెల 21 వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

మిగతాది 2లో




### హైకోర్టును ఆశ్రయించిన
# బండి భగీరథ్

- 14న విచారించనున్న వెకేషన్ బెంచ్

**హైదరాబాద్,మే12 :**
కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ హైకోర్టును ఆశ్రయించారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో మధ్యంతర బెయిల్ కోరుతూ బండి భగీరథ్ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టుకు వేసవి సెలవులు కావడంతో వెకేషన్ బెంచ్‌లో పిటిషన్ వేశారు.

2 లో



## 'ఏపీ, తెలంగాణ అవసరాల మేరకు కృష్ణా జలాలను వినియోగించుకోవాలి'

**హైదరాబాద్:**
ఏపీ, తెలంగాణ తాగునీటి అవసరాల మేరకు కృష్ణా జలాలను వినియోగించుకోవాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సమావేశంలో నిర్ణయించారు. హైదరాబాద్‌లో జరిగిన కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశంలో ఇరు రాష్ట్రాల ఈఎన్సీలు,



# ఆనాటి జైళ్లు దుర్భరంగా ఉండేవి
## బ్రిటిష్ హయాంలో నరక కూపాలుగా జైళ్లు

» తానూ ఎమర్జెన్సీలో జైలుకు వెళ్లి వచ్చా
» చంచల్‌గూడాలో మ్యూజియం, ఫీల్ ది జైల్ ప్రారంభంలో గవర్నర్





**హైదరాబాద్,మే12 :**
స్వాతంత్ర్యానికి ముందు జైళ్లు ఎంత అమానవీయంగా ఉండేవో ప్రజలకు తెలియజేయాల్సి ఉందని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తెలిపారు. మంగళవారం చంచల్‌గూడ జైలులో ఏర్పాటు చేసిన మ్యూజియం, ఫీల్ ది జైల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. స్వాతంత్రానికి పూర్వం జైల్లో గడిపిన వారు ఎలా ఉండేవారనే విషయం ఈ మ్యూజియంను చూస్తే తెలుస్తుందన్నారు. తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో మ్యూజియం, ఫీల్ ది జైల్ ప్రారంభించడం తనకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ మ్యూజియంలో ఉన్నది కేవలం ఇతిహాసానికి సంబంధించిన వస్తువులు కాదన్నారు. స్వాతంత్రానికి ముందు జైళ్లలో ఉన్నవారు ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నారో ఈ మ్యూజియం ద్వారా తెలుస్తుందని చెప్పారు. శిక్షల పేరుతో సంస్కారాన్ని, శరీరాన్ని, మనస్తత్వాన్ని విరగ్గొట్టే ప్రయత్నం చేశారని బ్రిటిష్ పాలనలో సాగిన అకృత్యాలను ఆయన వివరించారు.మన కోసం మన పూర్వీకులు పడ్డ కష్టాన్ని తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరు ప్రయత్నం చేయాలని ప్రజలకు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. విద్యార్థి నాయకుడిగా ఉన్న సమయంలో తాను పలుమార్లు జైలుకు వెళ్లానన్నారు. ఎమర్జెన్సీ సమయంలో 21 రోజులు తాను జైల్లో ఉన్నానని ఆయన గుర్తు చేసుకున్నారు.

02

## తెలంగాణ పోలీసుల ఎదుట
# లొంగిపోయిన మావోయిస్టు కీలక నేత



**హైదరాబాద్:**
మావోయిస్టు కేంద్రకమిటీ సభ్యుడు పసునూరి నరహరి అలియాస్ సంతోష్ తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఝార్ఖండ్‌లోని సరండా ఫారెస్ట్‌లో భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి.

2లో..

# నీట్ పేపర్ లీకేజీకి కేంద్రానిదే బాధ్యత

» పేపర్ లీకేజ్‌పై సమగ్ర విచారణ చేపట్టాలి
» ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్



**హైదరాబాద్,మే12 :**
దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష రద్దు కావడంపై ఎంపీ చామల కిరణ్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మే 3వ తేదీన జరిగిన నీట్ పరీక్షను రద్దు చేశారని అన్నారు. నీట్ పరీక్ష రద్దుకు నేషనల్ టెస్ట్ ఏజెన్సీ, సెంట్రల్ ఎడ్యుకేషన్ మినిస్ట్రీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ బాధ్యత



## బండి కుమారుడిని
# తప్పించే యత్నం

- సిట్ విచారణ పేరుతో కాలయాపన
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శలు

**నిజామాబాద్,మే12 :**
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు, దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రమంత్రి కుమారుడు పరారీలో ఉన్నాడని అనడం హాస్యాస్పదమని అన్నారు.

మిగతాద్ది 2 లో



2లో..

# సనత్‌నగర్ టిమ్స్‌లో వైద్యసేవల ట్రయల్ రన్

» స్వయంగా పరిశీలించిన మంత్రి దామోదర
» జూన్‌లో ప్రారంభిస్తామని వెల్లడి

**హైదరాబాద్,మే12 :**
సనత్‌నగర్ టిమ్స్‌లో జరుగుతున్న వైద్య సేవల ట్రయల్ రన్‌ను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పరిశీలించారు.హాస్పిటల్ బ్లాకులన్నీ మంత్రి కలియ తిరిగారు. ఓపీ రిజిస్ట్రేషన్, ఐపీ వార్డులు, ఎమర్జెన్సీ డిపార్ట్ మెంట్, సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ల్యాబులు, మెకనైజ్డ్ ల్యాండ్రీ, కిచెన్ తదితర అన్ని డిపార్ట్‌మెంట్లను మంత్రి పరిశీలించారు. పెండింగ్ పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి సూచించారు. హాస్పిటల్‌కు నీళ్లు, పవర్ సప్లైలో ఎలాంటి ఆటంకం ఉండకూడదని, 24 గంటల సరఫరా ఉండాలని మంత్రి సూచించారు.




# పోక్సో కేసులో కుల ప్రసక్తి ఉండదు

» చట్టం అందరికీ ఒకేలా ఉంటుంది
» పొన్న వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమన్న పిసిసి చీఫ్

**హైదరాబాద్,మే12 :**
తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలను టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఖండించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసు వ్యవహారంలో మంత్రి పొన్నం చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి లేదా ప్రభుత్వానికి పొన్నం వ్యాఖ్యలతో ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. మంగళవారం గాంధీభవన్‌లో మహేశ్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. కులసంఘం మధ్యవర్తిత్వం, వివాహం ద్వారా ఇలాంటి తీవ్రమైన కేసులను పరిష్కరించుకోవాలని పొన్నం అన్నారని తెలిపారు. పొన్నం సూచనలను కాంగ్రెస్ ఖండిస్తోందని మహేశ్ గౌడ్ వ్యాఖ్యానించారు.

# ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం సహించం

మొదటి పేజీ తరువాయి

ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాల్సిందే అని.. ప్రతి అధికారి జవాబుదారీ తనంతో వ్యవహరించాల్సిందే అని తేల్చిచెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై చర్యలకు ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. గోడౌన్స్ సమస్య ఉన్న ప్రాంతాల్లో అవసరాన్నిబట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతుబజార్లు, ఫంక్షన్ హాల్స్‌ను ఎంగేజ్ చేసి ధాన్యాన్ని తరలించాలన్నారు. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్స్‌కు తరలించేలా ప్రణాళికలుండాలని తెలిపారు. కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు సీఎస్‌కు పోర్ట్ పంపించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ధాన్యం లోడింగ్‌లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమాలీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలని రేవంత్ తెలిపారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో లారీల కొరత ఉంటే ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలని సూచించారు. అకాల వర్షాల సమయంలో ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. అకాల వర్షాల సమయంలో నష్టం జరగకుండా శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని సీఎం ఆదేశించారు. వాతావరణ సూచనలను రైతులకు చేరవేసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఐకేపీ సెంటర్‌కు ఒక అధికారిని నియమించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రైస్ మిల్లు దగ్గర ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలన్నారు. మిషన్ మోడ్‌లో పనిచేస్తేనే సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయని తెలిపారు. కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు తలెత్తవని.. ఏ సమస్య వచ్చినా కలెక్టర్లదే బాధ్యత అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# బండి కుమారుడిని తప్పించే యత్నం

మొదటి పేజీ తరువాయి

సిట్ విచారణ పేరిట నిందితుడిని సీఎం రేవంత్ రెడ్డి తప్పించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఒక మైనర్ బాలికకు డ్రగ్స్ ఇచ్చి, మద్యం తాగించి అత్యాచారం చేసినట్లు ఆరోపణలు వస్తున్నా.. పోలీసులు మూడు నెలలుగా ఫిర్యాదు తీసుకోకుండా తాత్సారం చేయడం వెనుక రాజకీయ ఒత్తిడి ఉందని వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. మీడియాలో వార్తలు వచ్చిన వెంటనే గత్యంతరం లేక పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. పోక్సో కేసులో బాధితురాలికి రక్షణ కల్పించాల్సింది పోయి.. ఆమెపైనే హనీట్రాప్ కేసు పెట్టడం దారుణమని మండిపడ్డారు. మైనర్ బాలిక హనీట్రాప్ చేస్తుందా అని ప్రశ్నించారు. బాధితురాలిపైనే రివర్స్ కేసులు పెట్టడం చూస్తుంటే రేవంత్ రెడ్డి, బండి సంజయ్ ఒక్కటేనని అర్థమవుతుందని అన్నారు. బాధితురాలిపైనే రివర్స్ కేసులు పెట్టడం చూస్తుంటే రేవంత్ రెడ్డి, బండి సంజయ్ ఒకటేనని అర్థమవుతోందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి బండి సంజయ్‌ది ఫెవికాల్ బంధమని విమర్శించారు. వీళ్లిద్దరూ కలిసి వ్యాపారాలు చేస్తున్నారని, కుంభకోణాలకు

పాల్పడుతున్నారని ఆరోపించారు. అందుకే కేంద్రమంత్రి కొడుకుపై ఇంత పెద్ద నేరం మోపబడినా ప్రభుత్వం మిన్నకుండిపోయిందని అన్నారు. ఒక్క కాంగ్రెస్ నాయకుడు కూడా దీనిపై స్పందించకపోవడం వెనుక మర్మమేంటని ప్రశ్నించారు. పొద్దున లేస్తే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు మీద విషం చిమ్మే బండి సంజయ్.. తన కొడుకు చేసిన నేరంపై ఏం సమాధానం చెబుతారని వేముల నిలదీశారు. తన కొడుకుపై వచ్చిన పోక్సో కేసుపై నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పోక్సో కేసులో నిందితుడైన బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని.. ఈ కేసులో రాజకీయ జోక్యం లేకుండా నిష్పక్షపాతంగా విచారణ జరపాలని.. బాధితురాలికి, ఆమె కుటుంబానికి తక్షణమే పూర్తిస్థాయి రక్షణ కల్పించాలి అని డిమాండ్ చేశారు. రాష్ట్ర పోలీసులు ఇప్పటికైనా ఒత్తిళ్లకు లొంగకుండా చట్టాన్ని గౌరవించాలని, బాధిత మైనర్ బాలికకు న్యాయం జరిగే వరకు తాము పోరాడుతామని స్పష్టం చేశారు.

# నీట్ పేపర్ లీకేజీకి కేంద్రానిదే బాధ్యత

మొదటి పేజీ తరువాయి

వహించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష రద్దుతో విద్యార్థులు తమ అకడమిక్ ఇయర్‌ను కోల్పోయే అవకాశం ఉందన్నారు. నీట్ పరీక్ష రద్దుపై బీజేపీ ప్రభుత్వం చర్చ చేపట్టాలన్నారు. దేశంలో అనేక విషయాలపై చర్చ చేసే బీజేపీ విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశంపై సమాధానం చెప్పాలని ఎంపీ డిమాండ్ చేశారు. బీజేపీకి పాలనపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తు, సామాన్యుడి అవసరం బీజేపీకి వద్దా అని నిలదీశారు. నీట్ పరీక్ష రద్దుకు పూర్తిగా కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం డబ్బులు ఖర్చు పెట్టి కోచింగ్‌లు ఇప్పించి నీట్ పరీక్ష రాయించారని తెలిపారు. రాజస్థాన్‌లో నీట్ పేపర్ లీకేజీ ఘటనపై కేంద్రం పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలన్నారు. విద్యార్థుల అకడమిక్ ఇయర్ దెబ్బతినకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంపీ చామల కిరణ్ రెడ్డి డిమాండ్ చేశారు.

## హైకోర్టును ఆశ్రయించిన
# బండి భగీరథ్

మొదటి పేజీ తరువాయి

పిటిషన్‌పై ఈనెల 14న హైకోర్టు వెకేషన్ బెంచ్ విచారణ జరిపే అవకాశం ఉంది.అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు బండి భగీరథ్ కేసుపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేస్తూ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసు సున్నితమైనది కావడంతో మహిళా ఐపీఎస్ అధికారిణి పర్యవేక్షణలో దర్యాప్తు కొనసాగించాలని డీజీపీ నిర్ణయించారు. ఇప్పటికే బాధితురాలి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేయడం జరిగింది. సిట్ ఏర్పాటు నేపథ్యంలో మరోసారి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసే అవకాశం ఉంది. మరోవైపు బండి భగీరథ్ కోసం పోలీసుల గాలింపు కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి అన్ని ఆధారాలను సేకరిస్తున్నామని, నేరం రుజువైతే నిందితుడిని కచ్చితంగా అరెస్ట్ చేస్తామని కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ స్పష్టం చేశారు.

# పోక్సో కేసులో కుల ప్రసక్తి ఉండదు

మొదటి పేజీ తరువాయి

మైనర్ల విషయంలో చట్టపరంగా ఇబ్బందులు తప్పవని చెప్పుకొచ్చారు. పోక్సో చట్టప్రకారం నిందితులకు కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. నేర పరిశోధనలో నిందితుడి కులం లేదా సామాజిక హోదాతో సంబంధం లేదని తెలిపారు. బండి సంజయ్ ఈ కేసులో కుల రాజకీయాలను తీసుకురావడం దురదృష్టకరమని అన్నారు. ఈ కేసులో ఎవరినీ వ్యక్తిగతంగా టార్గెట్ చేయాల్సిన అవసరం కాంగ్రెస్‌కి ఏమాత్రం లేదని స్పష్టం చేశారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని తేల్చిచెప్పారు. 'నారీ

శక్తి' అని నినాదాలు చేసే బీజేపీ, ఇప్పుడు బాలికపై జరిగిన దాడి విషయంలో మౌనంగా ఉండటం దేనికి సంకేతం..? అని మహేశ్ గౌడ్ ప్రశ్నించారు. బాలిక కుటుంబ సభ్యులను భగీరథ్ బెదిరిస్తున్నట్లు వస్తున్న వార్తలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని అన్నారు. నిజమని తేలితే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కేసు విషయంలో ఎలాంటి రాజకీయ జోక్యం, కుల మతాల ప్రభావం లేకుండా పారదర్శకంగా విచారణ జరుగుతుందని స్పష్టం చేశారు. నిందితుడు ఎంతటి శక్తివంతుడైనా సరే, బాధితురాలికి తాము అండగా నిలుస్తామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండోవిడుత పంపిణీ

మొదటి పేజీ తరువాయి

హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారులతో మంత్రి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాల్లో శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, రంగారెడ్డి జిల్లా ఇన్ ఛార్జి మంత్రి శ్రీధర్ బాబు, హైదరాబాద్ ఇన్ ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి మహ్మద్ అజారుద్దీన్, శాసన మండలిలో చీఫ్ విప్ మహేందర్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం దూరదృష్టి లేకుండా హైదరాబాద్ నగరానికి దూరంగా డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించడం వల్ల జరిగిన నష్టం కళ్లముందే కనిపిస్తున్నదన్నారు. అటువంటి తప్పు పునరావృత్తం కాకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు 5 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లను నిర్మించే విధంగా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకుని స్థలాలను గుర్తించి తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆనాటి ప్రభుత్వం నగరానికి 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో 2 బిహెచ్ కె ఇండ్లను నిర్మించి హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న వారికి కేటాయించడం వల్ల తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశ్యంతో ఇండ్లు తీసుకున్న లబ్దిదారులు అక్కడ నివసించడానికి సంసిద్ధతం వ్యక్తం చేయడం లేదని క్షేత్ర స్థాయి పరిశీలనల్లో స్పష్టమైందన్నారు. ఈ అంశాన్ని ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని ఏ నియోజకవర్గానికి సంబంధించి ఆ నియోజకవర్గంలోనే ప్రభుత్వ స్థలాలు, మురికివాడలు, భూదాన్, గతంలో వివిధ పథకాల కింద నిర్మించిన ఇళ్లు శిధిలావస్థలో ఉన్న ప్రాంతాలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈ విషయంలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యులను చేయాలని అధికారులను ఆదేశించారు. 2 బిహెచ్ కె ఇండ్లకు లబ్దిదారులను కేటాయించడానికి యుద్ధప్రాతిపదికన స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పూర్తి అయిన వాటికి, వివిధ నిర్మాణ దశల్లో ఉన్న వాటికి ఈ నెలాఖరు కల్లా లబ్దిదారులను గుర్తించాలని, అది కూడా ఆ కాలనీలకు అయిదు నుంచి ఎనిమిది కిలోమీటర్ల లోపు ఉన్న వారినే ఎంపిక చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే నిర్మాణాలన్నీ పూర్తైన ఇండ్లలో లబ్దిదారులు ఉండేలా చూసేలా నిరంతరం పర్యవేక్షించా లన్నారు. ఈ కాలనీల్లో మంచినీరు, డ్రైనేజి, విద్యుత్ వంటి కనీస సౌకర్యాల కల్పనకు వేగవంతమైన చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ పరిధిలో ఇండ్ల స్థలాలు ఉండి అర్హులైన లబ్దిదారులకు ఈనెల చివరిలోగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరక్టర్లు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని, పనితీరు మెరుగుపడాలని అన్నారు. పిడిలు తమ పరిధిలో గతంలో నిర్మించిన జెన్ఎన్ యుఆర్ఎం, రాజీవ్ గృహకల్ప, వాంబే హౌసింగ్ కాలనీలన్నిటిని సందర్శించాలని స్పష్టంగా నిర్దేశిరచారు. అంగుళం ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనా కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి పొంగులేటి హెచ్చరించారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో యుఎల్ సి భూములు కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా కొంత భాగాన్ని రిజిస్ట్రేషన్ చేశారని , స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి సమావేశంలో మంత్రి దృష్టికి తీసుకుని రాగా వెంటనే సంబంధిత సబ్ రిజిస్ట్రార్?పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. శాశ్వత భవనాలు లేని ఆర్డీవో, తహశీల్దార్, సబ్ రిజస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. రెవెన్యూ, ఫారెస్టు సరిహద్దు వివాదాలకు ముగింపు పలికేలా రెండు శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# ఆనాటి జైళ్లు దుర్భరంగా ఉండేవి
## బ్రిటిష్ హయాంలో నరక కూపాలుగా జైళ్లు

మొదటి పేజీ తరువాయి

అప్పుడే జైలు ఎలా ఉంటుందో తనకు తెలిసిందని వివరించారు. గతంలో ఉత్తరప్రదేశ్‌లో కళ్యాణ్ సింగ్ ప్రభుత్వంలో జైళ్ల శాఖ మంత్రిగా తాను పని చేశానని తెలంగాణ గవర్నర్ గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా జైళ్లలో తాను పలు సంస్కరణలు తీసుకొచ్చానని తెలిపారు. ఈ సంస్కరణలతో ఖైదీలు సంతోషం వ్యక్తం చేశారని చెప్పారు. ఈ రోజు మ్యూజియంలో చూసిన దృశ్యాలతో.. మళ్లీ ఆనాటి జ్ఞాపకాలు తనకు గుర్తుకు వచ్చాయన్నారు. ఖైదీలలో ప్రతి ఒక్కరూ క్రిమినల్స్ కాదని.. పరిస్థితులు వారిని ఆ సమయంలో నిందితులుగా మార్చాయని వివరించారు. ఖైదీలలో మార్పు తీసుకురావడానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జైలు అధికారులకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. మరోసారి తప్పుచేసే ఆలోచన రాకుండా ఖైదీల్లో పరివర్తన తీసుకురావాలని అధికారులకు స్పష్టం చేశారు. సాధారణ ప్రజల కోసం చంచల్‌గూడ జైలు అధికారులు వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. జైలు ఆవరణలో 'జైల్ మ్యూజియం', 'ఫీల్ ది జైల్' పేరుతో ప్రత్యేక బ్లాక్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ప్రారంభించారు. ఇప్పటికే గోవా, కోల్‌కతా వంటి ప్రాంతాల్లో జైలు మ్యూజియాలు ఉన్నాయి. తాజాగా హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు కూడా ఈ జాబితాలో చేరింది. జైల్ మ్యూజియంలో జైలు చరిత్ర, ఉపయోగించిన పాత వస్తువులు, ఖైదీల జీవితం, శిక్షల విధానాలు వంటి అంశాలను ప్రదర్శించనున్నారు. ఇది విద్యార్థులు, పర్యాటకులు, సాధారణ ప్రజలకు జైలు వ్యవస్థ గురించి అవగాహన కల్పించడానికి ఉపయోగపడనుంది. 'ఫీల్ ది జైల్' బ్యారక్ ద్వారా సాధారణ ప్రజలు ఒకరోజు జైలు జీవితాన్ని అనుభవించేలా జైలు అధికారులు అవకాశం కల్పించారు. ఫీజు చెల్లించి రిజర్వేషన్ చేసుకున్నవారు జైలు రూల్స్ ప్రకారం ఒక రోజు బ్యారక్‌లో ఉండి, జైలు ఆహారం, రొటీన్ కార్యకలాపాలు, శిక్షల వాతావరణాన్ని అనుభవించవచ్చు. ఇది జైలు జీవితం ఎంత కష్టమో అర్థం చేసుకోవడానికి సహాయపడుతుందని అధికారులు తెలిపారు.

## తెలంగాణ పోలీసుల ఎదుట
# లొంగిపోయిన మావోయిస్టు కీలక నేత

మొదటి పేజీ తరువాయి

పొలిట్ బ్యూరో సభ్యుడు మిసిర్ బెస్ర కోసం కూంబింగ్ కొనసాగుతున్న క్రమంలో.. నరహరి తన భార్యతో కలిసి పోలీసుల ఎదుట లొంగిపోయారు. నరహరి స్వస్థలం హనుమకొండ జిల్లా కాజీపేట మండలం సోమిడి కాగా.. అతని భార్య ఏపీకి చెందిన మహిళగా సమాచారం. 1996 నుంచి అజ్ఞాతంలో ఉన్న నరహరి పలు కీలక ఆపరేషన్స్‌లో పాల్గొన్నారు. మావోయిస్టు పార్టీకి చెందిన అగ్రనేతలు ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, మిసిర్ బెస్ర కోసం పోలీసుల వేట కొనసాగుతోంది.

# సనత్‌నగర్ టిమ్స్‌లో వైద్యసేవల ట్రయల్ రన్

మొదటి పేజీ తరువాయి

ఫైర్ సేఫ్టీ విషయంలో రాజీ ఉండకూడదని, అన్ని ఫ్లోర్లలో మరోసారి పూర్తిస్థాయి పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. రిసెప్షన్ ఏరియా, హెల్ప్ డెస్క్, ఓపీ కౌంటర్లు, వెయిటింగ్ హాల్, ఓపీ కన్సల్టేషన్ రూమ్స్, డయాగ్నస్టిక్స్, ఇన్ పేషెంట్ వార్డులు, ఫార్మసీ తదితర ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి.. రిజిస్ట్రేషన్ కౌంటర్స్, ఫార్మసీ కౌంటర్స్ పెంచాలని మంత్రి సూచించారు. సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ఎక్స్ రే, ఆల్ట్రాసౌండ్ తదితర యంత్రాలను పరిశీలించిన మంత్రి.. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ యంత్రాలు పూర్తిస్థాయిలో పేషెంట్లకు ఉపయోగపడాలని, ఇందుకు అవసరమైన డాక్టర్లు, ఇతర సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలని ఆరోగ్యశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రారంభం నాటికి అన్ని సౌకర్యాలతో హాస్పిటల్‌ను సిద్ధం చేయాలని, పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. జూన్‌లో సనత్‌నగర్ టిమ్స్‌ను ప్రారంభిస్తామని అన్నారు. ఇక్కడ సక్సెస్‌ఫుల్‌గా వైద్య సేవల ట్రయల్ రన్ జరుగుతోంది.కొన్ని ఫినిషింగ్ వర్క్స్ జరుగుతున్నాయి. ఆ పనులన్నీ గడువులోగా పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించామన్నారు. ఇది వెయ్యి బెడ్ల హాస్పిటల్, ఇందులో 300 ఎమర్జెన్సీ బెడ్లు ఉంటాయి. అత్యవసర పరిస్థితుల్లో బాధితుల ప్రాణాలు నిలిపే గొప్ప హాస్పిటల్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నాం. గుండె సంబంధిత వ్యాధుల చికిత్సలు, ఆర్గాన్ ట్రాన్స్‌ఎ÷-లాంటేషన్ సర్జరీలకు ఈ హాస్పిటల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఉంటుందని వివరించారు. ఇక్కడే అద్భుతమైన రీసెర్చ్ సెంటర్ అందుబాటులోకి తీసుకొస్తాం అని దామోదర అన్నారు.

# 'ఏపీ, తెలంగాణ అవసరాల మేరకు కృష్ణా జలాలను వినియోగించుకోవాలి'

మొదటి పేజీ తరువాయి

ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సాగర్‌లో ఆగస్టు 15 వరకు ఏపీకి 10 టీఎంసీల వినియోగానికి కేఆర్ఎంబీ అనుమతించింది. తెలంగాణకు సాగర్ నుంచి 16, శ్రీశైలం నుంచి 6 టీఎంసీల వినియోగానికి అంగీకారం తెలిపింది. ఏపీ ఇప్పటికే ఎక్కువ నీరు వాడుకుందని సమావేశంలో తెలంగాణ అధికారులు కేఆర్ఎంబీ దృష్టికి తీసుకెళ్లారు.


# రోగుల ప్రాణాలను కాపాడే యోధులు... నర్సులు

**సేవలో మానవత్వం... నర్సింగ్ వృత్తి గొప్పతనం**
**సంతృప్తికర వైద్య సేవల్లో నర్సుల పాత్ర కీలకం**
**వనరుల సద్వినియోగంతో ప్రైవేటుగా దీటుగా జీజీహెచ్ సేవలు**
**త్వరలో అన్ని సమస్యలకూ పరిష్కారం**
**ఎంపీ కేశినేని శివనాథ్**

రోగుల ప్రాణాలను కాపాడటంలో నర్సుల పాత్ర అత్యంత కీలకమని.. వైద్యులతో సమానంగా నర్సులు కూడా అహర్నిశలు కష్టపడుతూ రోగులకు ధైర్యం, భరోసా కల్పిస్తూ చక్కని చిరునవ్వుతో ఆత్మీయతతో రోగాన్ని దూరం చేస్తున్నారని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా మంగళవారం విజయవాడలోని న్యూ జీజీహెచ్‌లో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, శాసనసభ్యులు గద్దె రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. వైద్యరంగంలో కీలకమైన నర్సు వృత్తికి గౌరవాన్ని, హుందాతనాన్ని తీసుకొచ్చిన ఎ÷-లోరెన్స్ నైటింగేల్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ప్రజల ఆరోగ్యరక్షణలో నర్సులు అందించిన తోడ్పాటును ఈ సందర్భంగా స్మరించుకున్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.రిటైర్డ్ నర్సింగ్ సూపరింటెండెంట్ జి.అక్కమ్మ రూ. 50 వేలు అందించగా.. మరో లక్షా యాభైవేలు నర్సింగ్ అసోసియేషన్ ద్వారా సమకూర్చి ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.÷ార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ అందుబాటులో ఉన్న వనరులు, సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూనే జీజీహెచ్ ద్వారా అందించే వైద్య సేవల్లో 80 శాతానికి పైగా సంతృప్తి స్థాయి నమోదుకావడంలో నర్సుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఆసుపత్రితో పాటు నర్సింగ్ కళాశాల, వసతి గృహానికి సంబంధించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని.. త్వరలోనే ఇవి పరిష్కారమవుతాయన్నారు. ఆసుపత్రిలో ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా క్లిష్టమైన శస్త్రచికిత్సలు నిర్వహించి రోగుల మన్ననలు పొందుతోందని.. ప్రభుత్వ చొరవతో పాటు సీఎస్ఆర్, దాతల సహకారంతోనూ ఆసుపత్రి అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. శాసనసభ్యులు గద్దె రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. ఎ÷-లోరెన్స్ నైటింగేల్ సేవలు చిరస్మరణీయమని, ఆమె చూపిన సేవా మార్గం నేటికీ నర్సింగ్ వృత్తికి

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

మన మహతి న్యూస్ లక్ష్మీదేవి పల్లి



లక్ష్మీదేవి పల్లి మండలం మొర్రేడు బ్రిడ్జి వద్దనున్న ధర్మాదాయ దేవాదాయ శ్రీ దాసాంజనేయ స్వామి భజన మందిరంలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, హనుమాన్ చాలీసా పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి ఆశీర్వాదాలు పొందారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు కార్యనిర్వహణ అధికారి ఎన్. శేషయ్య తెలిపారు.

# హనుమాన్ జయంతి సందర్భంగా అన్నదానం

మన మహతి న్యూస్ కొత్తగూడెం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నియోజకవర్గంలోని సూపర్ బజార్ సెంటర్‌లో శ్రీ లలిత్ కంగన్ హాల్ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నప్రసాదాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు దుర్గ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరిపై హనుమంతుడి కరుణ ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేయడం దేవుడు ఇచ్చిన గొప్ప వరమని తెలిపారు.ఈ కార్యక్రమంలో పవన్, రాహుల్, వర్ధన్, మోహన్ రావు, మహిళలు, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ బాలికకు న్యాయం చేయాలి

- దోషులను వెంటనే అరెస్ట్ చేయాలి
- బి ఆర్ ఎస్ నాయకుల భారీ నిరసన

**శేరిలింగంపల్లి మన మహతి న్యూస్ మే 12:** బండి సంజయ్ కొడుకు బండి భగీరథ్ పై నమోదైన పోక్సో కేసులో సెక్షన్స్ 7,8 పెట్టకుండా కేసు నీరుగార్చడానికే సెక్షన్స్ 11, 12 పెట్టారు. ఫోక్సో కేసు కేంద్ర మంత్రి బండి సంజయ్ కొడుకు బండి భగీరథ చేసిన అఘాయిత్యానికి బాధిత మైనర్ బాలికకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ చందానగర్ డివిజన్ అంబేద్కర్ విగ్రహం వద్ద నేషనల్ హైవే 65 పై శేరిలింగంపల్లి బీ ఆర్ ఎస్ నాయకులు,కార్యకర్తలుభారీ నిరసన తెలియజేశారు.తెలంగాణ రాష్ట్రం లో సంచలనం రేపిన పోస్కో కేసు ఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వం మరియు బీజేపీ వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ శేరిలింగంపల్లి బీ ఆర్ ఎస్ నాయకుల,కార్యకర్తల ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కలిసి హైవేపై బైఠాయించి రోడ్డును దిగ్బంధించారు. "మైనర్ బాలికకు న్యాయం చేయాలి", "దోషులను వెంటనే అరెస్ట్ చేయాలి", "కాంగ్రెస్ -- బీజేపీ రాజకీయ నాటకాలు ఆపాలి" అంటూ



నినాదాలు చేశారు.తెలంగాణలో మహిళల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. దోషులను కఠినంగా శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని" డిమాండ్ చేశారు."ప్రజల భద్రతను కాపాడాల్సిన ప్రభుత్వాలు రాజకీయ ప్రయోజనాల కోసం మౌనం వహించడం దురదృష్టకరం. మైనర్ బాలికపై జరిగిన అమానుష ఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వం మరియు బీజేపీ నాయకత్వం



స్పష్టమైన వైఖరి చెప్పాలి. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదు" అని హెచ్చరించారు.ఈ ఆందోళన కార్యక్రమంలోజై మాజీ కార్పొరేటర్ బొబ్బ ఎఅఅ నవత రెడ్డి,పొట్ట నరేందర్ యాదవ్, రోజా, మమత, నాగమణి, వాలా హరీష్, మిద్దెల మల్లారెడ్డి, తిరుమలేష్, కె. రాములు, బీఎస్ఎన్ కిరణ్ యాదవ్, సంతోష్ రెడ్డి, రామకృష్ణ గౌడ్, శివరాజ్, శ్రీనివాస్, శ్రీకాంత్, ప్రకాష్, రాజు, వాకిటి శంకర్, నవీన్ యాదవ్, ప్రమోద్, ఘౌస్, బాబు మల్లేష్, సుభాష్ రాథోడ్, బీఆర్ఎస్వీ రాజు, షరీన్, రాజు, జహంగీర్ తదితరులు పాల్గొని బాధిత బాలికకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల పర్యవేక్షణకు సీఎం ఆదేశాలు

- గన్ని బ్యాగులు, హమాలీలు, లారీల కొరత లేకుండా చర్యలు -- అకాల వర్షాల నేపథ్యంలో టార్పాలిన్లు, తాత్కాలిక నిల్వ కేంద్రాల ఏర్పాటుకు సూచనలు
- నిర్లక్ష్య కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని హెచ్చరిక

**మన మహతి న్యూస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మే 12**

రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్లను మిషన్ మోడ్‌లో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాలను ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని సూచించారు.



గన్ని బ్యాగులు, హమాలీలు, లారీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం వహించే కాంట్రాక్టర్లపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని హెచ్చరించారు. గోదాంల సమస్య ఉన్న ప్రాంతాల్లో రైతుబజార్లు, ఫంక్షన్ హాల్స్‌ను తాత్కాలిక నిల్వ కేంద్రాలుగా వినియోగించాలని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులు నష్టపోకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, వాతావరణ హెచ్చరికలను రైతులకు



చేరవేసేందుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు.ధాన్యం కొనుగోళ్ల విషయంలో కలెక్టర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించగా, తెలంగాణలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పేర్కొన్నారు.

# హౌసింగ్ పీడీని కలిసి వినతిపత్రం.. అందజేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల బాధితులు..

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం ఏపూరు గ్రామానికి చెందిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల లబ్ధిదారులు జిల్లా హౌసింగ్ పీడీ పురుషోత్తంను కలిసి తమ సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు.

బాధితులు తెలిపిన వివరాల ప్రకారం, గతంలో కెసిఆర్ ప్రభుత్వం నిరుపేదలకు పక్కా ఇళ్ల నిర్మాణం కోసం ఏపూరు గ్రామానికి 25 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను మంజూరు చేసిందన్నారు. లబ్ధిదారులు అప్పులు చేసి ఇండ్ల నిర్మాణాన్ని పూర్తిచేసుకున్నప్పటికీ, గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం నుంచి రావలసిన బిల్లులు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇల్లు పూర్తిచేసుకుని సంవత్సరం దాటుతున్నా ఇప్పటికీ బిల్లులు అందకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్య వైఖరి కారణంగా పేద బడుగు బలహీన వర్గాల ప్రజలు అన్యాయానికి గురవుతున్నారని ఆరోపించారు.



తమకు రావలసిన బిల్లులను వెంటనే విడుదల చేసి న్యాయం చేయాలని హౌసింగ్ పీడీని బాధితులు కోరారు.

వినతిపత్రం అందజేసిన వారు బానోతు రామన్న నాయక్, భూక్యా బిక్కు నాయక్, బానోత్ చందా ధరావత్ లచ్చు జాటోత్ సతీష్ వాంకుడోత్ వద్య బోడ నరేష్ బానోత్ సూర్య తదితరులు పాల్గొన్నారు

# గిరిజన సంక్షేమ శాఖ :: వరంగల్ జిల్లా

- హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేట మరియు రామాంతపూర్ ఇంగ్లీష్ మీడియం ఒకటవ తరగతి ప్రవేశమునకు


**వరంగల్ జిల్లా మే 12 న్యూస్**

ఆర్.సి.నెం. =3/124/2026 తేది: బి-05-2026

ఇందుమూలముగా వరంగల్ జిల్లా లోని నిరుపేద గిరిజన విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయునది ఏమనగా, 2026-27 విద్యా సంవత్సరమునకు గాను జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయం, వరంగల్ ద్వారా గిరిజన విద్యార్థులను (3 బాలురు ఌ 3 బాలికలు) లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేసి, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, బేగంపేట మరియు రామాంతపూర్ పాఠశాలలలో ఇంగ్లీష్ మీడియం ఒకటవ తరగతి ప్రవేశమునకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

కావున అర్హత కలిగి ఆసక్తి గల పేద గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు తమ కుమారుడు / కుమార్తె యొక్క దరఖాస్తులను మరియు సంబంధిత ధృవీకరణ పత్రములతో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి, వరంగల్ గారి కార్యాలయంలో తేది: 18-05-2026 రోజున సాయంత్రం 5:00 గంటల లోపు సమర్పించవలెను.

అలాగే దరఖాస్తులతో పాటు సంబంధిత ధృవీకరణ పత్రములు సక్రమంగా సమర్పించిన విద్యార్థులను ప్రాజెక్ట్ అధికారి క్యాంపు కార్యాలయం, అశోకానగర్ కాలనీ, హన్మకొండ (జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయం,



తెలంగాణ ప్రభుత్వం

గిరిజన సంక్షేమ శాఖ వరంగల్ జిల్లా:

ప్రవేశ ప్రకటన

వరంగల్) నందు తేది: 22-05-2026 రోజున లక్కీ డిప్ (లాటరీ పద్ధతి) ద్వారా ఎంపిక చేయబడును.కావున ఆసక్తి కలిగిన విద్యార్థుల తల్లిదండ్రులు తమ స్వంత ఖర్చులతో హాజరు కావలెను. నమూనా దరఖాస్తు ఫారములు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి, వరంగల్ గారి కార్యాలయంలో లభించును.

**అర్హతలు:**

విద్యార్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం పట్టణ ప్రాంత వాసులకు రూ. 2,00,000/- మరియు గ్రామీణ ప్రాంత వాసులకు రూ. 1,50,000/-లకు మించరాదు.ఇందుకు సంబంధించి తహసీల్దార్ గారిచే మీ సేవ ద్వారా జారీ చేసిన ఆదాయ ధృవీకరణ పత్రం సమర్పించవలెను.విద్యార్థులు 01-06-2019 నుండి 31-05-2020 మధ్య జన్మించిన వారై ఉండవలెను.ఇందుకు సంబంధించి మున్సిపల్ కార్పొరేషన్ / మున్సిపల్ బోర్డు / తహసీల్దార్ గారిచే జారీ చేసిన జనన ధృవీకరణ పత్రం సమర్పించవలెను. విద్యార్థుల నివాస ధృవీకరణ పత్రం సంబంధిత తహసీల్దార్ గారిచే జారీ చేసినదై ఉండవలెను.

**పూర్తి చేసిన దరఖాస్తుతో పాటు క్రింది పత్రాలు జత చేయవలెను:**

పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు -- 3
ఆదాయ ధృవీకరణ పత్రం
కుల ధృవీకరణ పత్రం
నివాస ధృవీకరణ పత్రం
జనన ధృవీకరణ పత్రం

పై పత్రాలన్నింటి జిరాక్స్ కాపీలను గెజిటెడ్ అధికారి చేత అటెస్టేషన్ చేయించి జతపరచవలెను.

## హుజురాబాద్ మాజీ మార్కెట్ చైర్మన్ బర్మావత్ రమ యాదగిరి కుమారుడు వెంకటేష్ మ్యారేజ్ రిసెప్షన్ లో నూతన వధూవరులను ఆశీర్వదించిన

- బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వి ఎన్ నాయక్,చినబాబు నాయక్, పల్లవి రాజు నాయక్, రమేష్ నాయక్, సోము నాయక్,మురళి నాయక్.



**హుజురాబాద్ మే 12 న్యూస్**

హుజురాబాద్ మాజీ మార్కెట్ చైర్మన్ బర్మావత్ రమయాదగిరి కుమారుడు బర్మావత్ వెంకటేష్ మ్యారేజ్ రిసెప్షన్ హుజురాబాద్ లో నూతన వధూవరులను ఆశీర్వదించిన బంచారా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి ఎన్ నాయక్, లంబాడీల ఐక్యవేదిక లైవ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు లావుడియా పల్లవి రాజు నాయక్, సేవాలాల్ సేన జాతీయ అధ్యక్షులు చిన బాబు నాయక్, మాజీ ఎంపీటీసీ బాదావత్ సోము నాయక్, డాక్టర్ పోరిక రమేష్ నాయక్, సేవాలాల్ సేన హన్మకొండ జిల్లా అధ్యక్షులు కునుసోతు మురళి నాయక్, వివిధ కుల సంఘాల నాయకులు రాజకీయ నాయకులు బంధుమిత్రులు పెద్ద ఎత్తున హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు

## లావుడియా కృష్ణవేణి రాందాస్ మ్యారేజ్ రిసెప్షన్ పెద్ద తండాలో నూతన వధూవరులను శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించిన అజ్మీర వసంత చీమన్ నాయక్, అజంత రాజు, మమత గణపతి.



**భూపాలపల్లి జిల్లా మే 12 న్యూస్**

భూపాలపల్లి జిల్లా గొల్ల బుద్ధారం పెద్ద తండాలో లావుడియా ఫుల్ బంద్ సీతారాం నాయక్ కుమారుడు లావుడియా కృష్ణవేణి రాందాస్ మ్యారేజ్ రిసెప్షన్ లో నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన లంబాడీల ఐక్యవేదిక లైవ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పల్లవి రాజు నాయక్ సర్పంచ్ అజ్మీర జైపాల్ నాయక్,లావుడియా తారాబాయి, జ్యోతి బాలు నాయక్, శారద రాము నాయక్, చాంది దాసు నాయక్, సరోజన, విజయ రఘురాం, లలిత, ఫుల్ బంద్, లలిత కరణ్, అరుణ రాజన్న, అజ్మేరా ఆనందా రవి నాయక్, అజ్మీర వసంత చీమన్ నాయక్, మమత గణపతి, అజంత రాజు, హట్కర్ రజిత రాజన్న, లావుడియా వనిత గోవర్ధన్, విజయ హేమ నాయక్, పల్లవి రాజు నాయక్, సరిత గణపతి, సునీత సునీల్, కల్పన గోపాల్, సంధ్య సందీప్, కుమారి రాజు నాయక్, కవిత జయపాల్, సుజాత ఉదయ్ సింగ్, సరిత జెల్ సింగ్, మమత సంతోష్, రాజు నాయక్, సంపూర్ణ, చంద్రం, సురేందర్, హనుమంతు, రాహుల్, అనంతరం, రాజు నాయక్ గోపి నాయక్, ప్రతాప్ నాయక్, మల్లయ్య కళ్యాణ్, కార్తీక్, పరం సింగ్, రతన్ సింగ్, సునీత, ఆశిలాల్, రాజు నాయక్, రంజిత్ నాయక్, నవీన్ నాయక్, రాము, మొదలైన వారు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు

## ప్రతి గ్రామంలో అభివృద్ధి భాగంగా ముందుకు వెళ్లాలి కున్సీ గ్రామ సర్పంచ్

**మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం కృష్ణ మండలం.**



కున్సి గ్రామ అభివృద్ధిలో భాగంగా 10వ వార్డులో డ్రైనేజ్ కాలువల పనులను గ్రామ సర్పంచ్ మ్యాకలి సురేష్ కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. దాదాపు 300 మీటర్ల పొడవైన కాలువ నిర్మాణం కోసం శ్రీకారం చుట్టారు. కాలువలు పరిశుభ్రతను కాపాడటంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయన్నారు. డ్రైనేజ్ కాలువలు సరిగా ఉంటే నీరు నిల్వ కాకుండా ఉండి, దోమలు మరియు వ్యాధులు తగ్గుతాయని సర్పంచ్ తెలిపారు. అభివృధి పనులపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. , గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మక్తల్ లో.రైలు కింద పడి యువకుడి మృతి

**మన మహతి న్యూస్ ప్రతినిధి**

నారాయణ పేట జిల్లా మక్తల్ పట్టణ శివారులోని రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఓ యువకుడు దుర్మరణం చెందాడు.మృతుడిని పట్టణంలోని బాపూజీ నగర్కు చెందిన జుట్ల వాసుగా రైల్వే పోలీసులు గుర్తించారు. హైదరాబాద్లో చదువుకుంటున్న వాసు, పట్టణ శివారులో రైలు కింద పడి ప్రాణాలు విడిచాడు. ఇది ఆత్మహత్యా లేక ప్రమాదవశాత్తూ జరిగిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# పిల్లలు పెడదారి పట్టకుండా చూడాలి.

**●సామాజిక వేత్త బిజ్వార్ మహేష్ గౌడ్.**

మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా ఉట్కూరు మండలం.



పిల్లలు కాదు పిడుగులు అని పెద్దలు ముచ్చటగా అలనాటి సామెత మాట. కానీ ఈనాటి పిల్లలు పదో తరగతి పూర్తి చేసిన నాటి నుంచి వాడు జీవితంలో సెటిల్ అయ్యే వరకు కొందరు పిల్లలు తల్లిదండ్రులకు పిడుగులు కాదు పిశాచాలుగా తయారవుతున్నారని, సమాజానికి,కన్న తల్లిదండ్రులకు ముచ్చెమటలు పట్టిస్తున్నారని అటు సమాజంలో ఇటు కుటుంబంలో కునుకు లేకుండా చేస్తున్నారని సామాజిక వేత్త బిజ్వార్ మహేష్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తన యొక్క ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల పెంపకంతో పని లేకుండా చిన్ననాటి నుండి నేర ప్రవృత్తితో పెరుగుతున్నారని చుట్టూ ఉన్న వారి పరిసరాల ప్రభావం,స్వేచ్ఛగా జీవించే వెసులుబాటు,భవిష్యత్ అవసరాలకు సరిపడా ఆర్థిక వెసులుబాటు కుటుంబానికి కలిగి ఉండటం ఇది అవసరం అని తెలిసేలోపే పిల్లలకు తల్లిదండ్రులు సర్దుబాటు చేయడం వలన పిల్లలకు తన అవసరం ఏమిటో తెలియకుండా పోతుందని ఆయన వాపోయారు.పిల్లలను తీక్షణంగా గమనిస్తే తప్ప వారు తప్పటడుగులు వేస్తున్నారనే విషయం గమనించలేనంతగా తల్లిదండ్రులు ఉంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఎవరి స్థాయిలో వారికి చెడిపోవడానికి ఆ కుటుంబం వెసులుబాటు లేదా అవసరానికి సమకూర్చగలిగిన స్తోమత వారికి కావాల్సిన సాధనాలు అవసరం లేకపోయినా బండి,సెల్లు, కారు,డబ్బు విలాసవంతమైన ఇల్లు,పల్లెల్లో రాజకీయ నేపథ్యంలో కూడిన వాతావరణం ఇలా ఒకటి అని కాదు తొందరగా చెడిపోవడానికి కావలసిన ప్రతి ఒక్క సాధనాలు అందుబాటులో ఉంటున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ఇది చేయవచ్చు,చేయకూడదో అని ఆలోచన శక్తి లేకుండా స్నేహం,ఇంటర్నెట్,హర్రర్ చిత్రాలు యూట్యూబ్లో ఎక్కువ సమయం పలు కారణాలు వారికి దగ్గరగా ఉంటున్నాయని వాటితో గడపడానికి ఎక్కువగా ఇష్టపడుతున్నారని ఉమ్మడి కుటుంబాలుగా లేకపోవడం,అడిగిందే తడువుగా తల్లిదండ్రులు ఇవ్వడం,ఆహారపు అలవాట్లు చిరుతిండ్లకు అలవాట్లు పడటం వల్ల ఒకటికి ఇంకొకటి తోడుగా పిల్లల ఆలోచనలు రూపాంతరం చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.మత్తు పానీయాలు,గంజాయి,గుట్కా వంటి మత్తు పదార్థాలు సైతం తల్లిదండ్రులకు కంటపడకుండా అలవాటు చేసుకుని ఆ మైకంలో తప్పులు చేసి తల్లిదండ్రులకు తలనొప్పి తెచ్చి కుటుంబం వీధిన పడేలా చేస్తున్నారని జీవితంలో స్థిరపడటానికి కావాల్సిన మార్గాల కంటే విలాసవంతమైన జీవితం,ఇదే ప్రపంచం అని భ్రమించి ఇటు సమాజాన్ని అటు కుటుంబాన్ని మతిభ్రమించేలా చేస్తున్నారని క్రిమినల్ మైండ్ తో అనునిత్యం నేరపూరితమైన జీవితంలో మునిగిపోతున్నారని ఆయన బాధపడ్డారు.జీవితం గురించి కుటుంబం గురించి ఆలోచన లేకుండా మూడు పదుల వయసు దాటుతున్న ఉద్యోగం,పెండ్లి,సొసైటీ కుటుంబం బాధ్యత మరచి ముప్పేట మూడు పూటలు తిని కన్న తల్లిదండ్రులకు భారంగా మారుతున్నారని,కన్న నేరానికి భరించక తప్పదు అన్నట్టుగా తల్లిదండ్రులకు శాపగ్రస్తులుగా కొందరు యువత సమాజానికి కుటుంబానికి భారంగా తయారవుతున్నారన్నారు. కొందరు ఆకలి అవసరం అనేది లేకుండా తిరుగుతున్నారని, బ్రతకడానికి ఉద్యోగం ఒకటే మార్గం కాదని వళ్ళు వంచి పని చేస్తే పలు మార్గాలు యువత కాళ్ల దగ్గరకు వస్తాయని మహేష్ గౌడ్ తెలిపారు.కానీ పనిచేసి బ్రతికే అవసరం లేకుండా పోతుంది ఈనాటి కొందరు యువతకు ఆర్థికంగా వెసులుబాటు కలిగి ఉండడం మధ్యతరగతి చిన్న కుటుంబాలకు ప్రభుత్వం సంక్షేమ నిత్యవసర వస్తువులు, పింఛను,వ్యవసాయ కార్మికుల జీవనోపాధి పథకాలు,ఆర్థిక వెసులుబాటు కొరకు ఓట్ల భయంతో రాజకీయ నాయకులు అందిస్తున్న తాయిలాలు ప్రభుత్వ స్కీముల రూపంలో పనిచేయకుండా యువత సోమరితనాన్ని పెంచే ప్రభుత్వ పథకాలు రేపటి కొరకు తిండి లేదు అనే భయం ఈనాటి యువతకు ప్రభుత్వం అందిస్తున్న కిలో రూపాయి సన్న బియ్యం లాంటి పథకాలు. గ్రామంలో ఉన్న జనాభా కంటే కుటుంబం రేషన్ కార్డులు ఎక్కువగా ఉన్నాయన్నారు.ఉచితంగా ఉపాధి కల్పించే విధంగా ప్రభుత్వ పథకాలు ఉన్నాయని, చిన్నతనంలోనే డ్రగ్స్ కు అలవాటు పడకుండా,మత్తు పదార్థాలకు దూరంగా ఉంటే కఠినంగా వ్యవహరించే చట్టాలు అరికట్టే వ్యవస్థ ఇప్పుడు ఎంతో అవసరం అని ఆ తరహాలో ప్రభుత్వం ఆలోచన చేయకపోతే చేతికి వచ్చిన యువత చేజారిపోతుందన్నారు. అటు సమాజానికి ఇటు కుటుంబానికి యువత భారంగా మారే రోజు వస్తుందని,యువత పెడదారి పట్టకుండా ప్రభుత్వాలు, తల్లిదండ్రులు జాగ్రత్త పడాలని యువత తస్మాత్ జాగ్రత్త అని మహేష్ గౌడ్ పేర్కొన్నారు.

# మక్తల్ మున్సిపాలిటీ 9వ వార్డు ఎన్నికలు ముగిసిన ఇప్పటిదాకా సిసి.రోడ్డు పనుల్లో కదలని అడుగు.



నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో టి. లలితమ్మ ఇంటి దగ్గర నుంచి అంగన్వాడి చంద్రకళ మేడమ్ ఇంటి వరకు మున్సిపల్ ఎన్నికలకు ముందు మొదటి దశ సీసీ రోడ్డు పనులు చేపట్టారు. ఆ రోడ్డును అభివృద్ధి పేరుతో చూపిస్తూ అధికార పార్టీ అభ్యర్థులు ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగారు. ప్రజలు నమ్మి ఓట్లు వేసి గెలిపించారు.అదే 9వ వార్డులో గెలిచిన వారు అధికార పార్టీకి చెందినవారే. ప్రస్తుతం వారు మున్సిపల్ వైస్ చైర్మన్గా కొనసాగుతున్నారు.

ఎన్నికలు ముగిశాయి...

అభ్యర్థి గెలిచారు...

పదవులు పొందారు...

మూడు నెలలు పూర్తవుతున్నాయి...

కానీ ఇప్పటికీ రెండో దశ సీసీ రోడ్డు పనులు మాత్రం పూర్తి కాలేదు.

ఆ పని ఎందుకు ఆగింది?

ఎవరి నిర్లక్ష్యం వల్ల పెండింగ్లో పడింది?

అధికారుల నిర్లక్ష్యమా?

పాలకుల నిర్లక్ష్యమా?

లేక కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా?

ఎన్నికల ముందు ప్రజల ఓట్ల అవసరం ఉన్నప్పుడు ఆ సీసీ రోడ్డును చూపించి ఓట్లు అడిగారు. ఇప్పుడు గెలిచిన తర్వాత ఆ రోడ్డును పూర్తి చేసే బాధ్యత అధికారులకు, పాలకులకు లేదా?

ఇప్పటికే వార్డు ప్రజల్లో వినిపిస్తున్న మాట ఏమిటంటే

"కాంట్రాక్టర్కు ఇసుక దొరకడం లేదని" కారణాలు చెబుతూ పనిని పెండింగ్ పెడుతున్నారని తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

కానీ మక్తల్ ప్రాంతం నుంచే రోజూ వందలాది టిప్పర్లలో ఇసుక తెలంగాణ అంతటికి వెళ్తోంది.

ప్రతి గ్రామంలో...

ప్రతి పట్టణంలో...

ప్రతి గల్లీలో నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

అయితే ఈ ఒక్క సీసీ రోడ్డుకే ఇసుక దొరకడం లేదని చెప్పడం ఎంతవరకు నిజం? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

తెలంగాణ అంతటా ఇసుక దొరుకుతుంటే ఈ గల్లీకి మాత్రమే ఎందుకు దొరకడం లేదు?

ఎన్నికల ముందు మా ఓట్లు అవసరమై రోడ్డు చూపించారా?

ఇప్పుడు ప్రశ్నిస్తే "ఇసుక లేదు" అని సాకులు చెప్పడమేనా?

ఇక్కడ ఎవరి నిర్లక్ష్యమో ప్రజలకు తెలియకపోయినా... అధికారులు, పాలకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్ వెంటనే స్పందించి పెండింగ్లో ఉన్న సీసీ రోడ్డు పనులను పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని 9వ వార్డు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# వైద్య రంగానికి మంత్రి వాకిటి శ్రీహరి పెద్దపీట.

**●ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం.**

మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం.




16వ వార్డు కౌన్సిలర్ అల్కూరి పావనివైద్య రంగానికి తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి పెద్దపీట వేస్తున్నారని, మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో 150 పడకల ఆసుపత్రిని అతి త్వరలో పూర్తిచేసి నియోజకవర్గ వాసులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారని 16వ వార్డు కౌన్సిలర్ అల్కూరి పావని అన్నారు. మంగళవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా మక్తల్ ఆసుపత్రిలో నర్సులకు శాలువా కప్పి సత్కరించారు.ఈ సందర్భంగా అల్కూరి పావని మాట్లాడుతూ... వైద్యరంగంలో నియోజకవర్గానికి మంత్రి వాకిటి శ్రీహరి పెద్దపీట వేస్తున్నారని, ఇందులో భాగంగానే ఏకంగా 64 మంది నర్సులు ప్రస్తుతం పని చేస్తున్నారని, 150 పడకల ఆసుపత్రి పనులు సైతం శరవేగంగా జరుగుతున్నాయని, రాబోయే దసరాలోపు ఆసుపత్రిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తారని తెలిపారు. మక్తల్ ఆసుపత్రితో మంత్రి వాకిటి శ్రీహరికి విడదీయరాని అనుబంధం ఉందని, వారి తల్లి రాములమ్మ సైతం నర్సుగా దశాబ్దాల పాటు పనిచేశారని, ఆమె ఎనలేని సేవ చేశారని కొనియాడారు. మక్తల్ ప్రాంతంలో వైద్యం కోసం ఇకపై దూర ప్రాంతాలకు వెళ్లకుండా అన్ని రకాల వైద్య సేవలు 150 పడకల ఆసుపత్రిలోని అందించే విధంగా మంత్రి వాకిటి శ్రీహరి కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సివిల్ ఆస్పత్రి సూపర్డెంట్ డాక్టర్ వినుత, సన్మాన గ్రహీతలు స్టాఫ్ నర్స్, కోఆప్షన్ నెంబర్ వల్లంపల్లి లక్ష్మణ్, మార్కెట్ డైరెక్టర్ శాలం, 16వ వార్డు స్థానిక నాయకులు రామ్ నారాయణ, టింగిల్ గోపాల్ ,ఏ.రవికుమార్, రంజాన్, సయ్యద్ సలీం ,మహమ్మద్, అమ్రేష్, గఫర్, వినయ్, సంతోష్, కడేచూర్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గిరిజన శాఖ ఎస్ఈ ఎస్ఈ ఫణికుమారి ఆకస్మిక పర్యటన..

**●యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు పూర్తి చేయాలి..**

**●క్రమశిక్షణరాహిత్యానికి పాల్పడే ఉద్యోగులపై కఠిన చర్యలు :**

**●ఎస్ఈ ఫణికుమారి**

భద్రాచలం, మే 12 మన మహతి న్యూస్



ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొనసాగుతున్న గిరిజన అభివృద్ధి పనులను గిరిజన సంక్షేమ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ (ఎస్ ఈ) ఫణికుమారి ఆకస్మికంగా పరిశీలించారు. పినపాక నుంచి భద్రాచలం, కొత్తగూడెం, ఏన్కూర్ మీదుగా సింగరేణి, ఇల్లందు మండలాల వరకు పర్యటిస్తూ వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు.ఈ పర్యటనలో భాగంగా బీటీ రోడ్లు, బ్రిడ్జిలు, గ్రామపంచాయతీ భవనాలు, గిరిజన విద్యాసంస్థల డార్మిటరీలు, స్టాఫ్ క్వార్టర్లు, నూతన కార్యాలయ భవనాల నిర్మాణ పనులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం భద్రాచలంలోని కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పనుల పురోగతిపై చర్చించారు. సుమారు 14 గంటల వ్యవధిలో విస్తృత స్థాయిలో పర్యటన పూర్తి చేయడం అభినందనీయమని అధికారులు పేర్కొన్నారు.సమీక్ష సమావేశంలో ఎస్ఈ ఫణికుమారి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని గిరిజన అభివృద్ధి పనులు, విద్యాసంస్థల భవనాల మరమ్మత్తు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మధుకర్తో పాటు ఉప ఇంజనీర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఐటిడిఏ పరిధిలో జిల్లా కలెక్టర్లు, ప్రాజెక్ట్ అధికారులకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జవాబుదారిగా ఉండే నేపథ్యంలో ఉప ఇంజనీర్లు, సహాయ ఇంజనీర్లు సమన్వయంతో పనిచేసి సకాలంలో పనులు పూర్తి చేయాలని సూచించారు.క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేసిన ఎస్ఈ ఫణికుమారి, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించని గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవడంలో వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ యొక్క కార్యక్రములో ఉప ఇంజనీర్లు రాజు హరీష్ బాపనయ్య అకౌంట్స్ ఆఫీసర్ శంకరకటకం,సూపరిండెంట్ వెంకటస్వామి భవాని మరియు సహాయక ఇంజనీర్లు పాల్గొన్నారు.

# .కురగల్లు గ్రామంలో ఘనముగా ఇబ్రహీం జన్మదినోత్సవ వేడుకలు

మన మహతి ప్రతినిధి:భ్రమరాంబ



మంగళగిరి న్యూస్,మే.13

కురగల్లు గ్రామంలో సీనియర్ టిడిపి నాయకులు, ఆంధ్రప్రదేశ్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మహమ్మద్ ఇబ్రహీం జన్మదిన వేడుకలు కురగల్లు గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. టిడిపి మంగళగిరి నియోజకవర్గ నాయకులు కట్టెపోగు ఉదయ భాస్కర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కేక్ ను కట్ చేసి ఇబ్రహీం కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం కట్టెపోగు ఉదయ భాస్కర్ మాట్లాడుతూ ఎన్టీ రామారావు పార్టీని స్థాపించినప్పుడు ప్రత్యేకించి మంగళగిరిలో పార్టీ కోసం వచ్చిన 9.మందిలో మొదటి వ్యక్తి ఇబ్రహీం అని అన్నారు. ఎన్టీ రామారావు తో సన్నిహితంగా ఉంటూఆనాటి నుండి ఈనాటి వరకు పార్టీ బలోపేతం కోసం అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తూ ఎస్సీ ఎస్టీ మైనార్టీలను కలుపుకొని ఐక్యంగా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న యువకుడు ఇబ్రహీం అని ఉదయ భాస్కర్ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ భవిష్యత్తులో ఇంకా మరెన్నో పదవులు పొందాలని ఆరోగ్య,ఆయుష్షులతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ జన్మదిన వేడుకల్లో బూత్ కన్వీనర్ రావూరి రవిప్రసాద్, బుల్లా నాగరాజు,రావూరి నాగబాబు,టంగుటూరి జానుబాబు,పార్టీ ప్రధాన కార్యదర్శి రావూరి శేషగిరిరావు, కుమ్మరి ప్రేమ్ కుమార్,సేవా సంస్థ వ్యవస్థాపకులు కే అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# త్రాగునీటి సమస్య ను శాసనసభ్యులు వసంత దృష్టికి తీసుకువెళ్లిన లంక లితీష్



మన మహతి ప్రతినిధి:భ్రమరాంబ

మైలవరం న్యూస్,మే.13

ఎన్టీఆర్ జిల్లా,మైలవరం మండలం,మైలవరం లోని చిన్న హరిజనవాడ సమీపంలో త్రాగునీటి కొరతపై శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ దృష్టికి తీసుకోవడం లంక సతీష్ ఈ విషయంపై వెంటనే స్పందించిన శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్. వేసవి దృష్ట్యా త్రాగునీటి కొరత లేకుండా అదనపు బోరును ప్రారంభించిన తెలుగుదేశం పార్టీ నాయకులుతాగునీటి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ కి నాయకులకు కృతజ్ఞతలు తెలిపిన చిన్న హరిజనవాడ ప్రజలు ఈ కార్యక్రమంలో మైలవరం మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు పసుపులేటి రేణుక పట్టణ కార్యదర్శి వేముల అంకరాజు తెలుగుదేశం పార్టీ నాయకులు బుడిపూడి వెంకట్రావు మద్దినేని శ్రీను గ్రామపంచాయతీ కార్యదర్శి ఎండి రఫీ పాల్గొన్నారు

# ఘనముగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు-మహానేత అమరజీవి కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ శత జయింతి ఉత్సవ వేడుకలు

మన మహతి ప్రతినిధి:భ్రమరాంబ

ఇబ్రహీంపట్నం న్యూస్,మే.13





ఇబ్రహీంపట్నం ఎం సి పి ఐ (యు )రాష్ట్ర కార్యాలయంలో ఘనముగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, మహానేత అమరజీ కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ శత జయంతోత్స వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన ఎంసిపిఐ(యు)ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ గొల్లపూడి ప్రసాద్అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో (1946-51) కీలక పాత్ర పోషించి,నిజాం సర్కార్పై, భూస్వామ్య వ్యవస్థపై గళమెత్తారు.కమ్యూనిస్టు సిద్ధాంతాలను నమ్మిన ఆయన, ఎం పి ఐ (యు) - మార్కిస్ట్ కమ్యూనిస్ట్ పార్టీ అఫ్ ఇండియా (యునైటెడ్) వ్యవస్థాపకులలో ఒకరిగా పిలిచారని నర్సంపేట ఎమ్మెల్యేగా (1972-1989) నర్సంపేట నియోజకవర్గం నుండి వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు.ఆయనది నిస్వార్థ రాజకీయం,నిరుపేద ప్రజల కోసం, భూమి,భుక్తి,విముక్తి కోసం పోరాడారని,ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ,అత్యంత నిరాడంబరమైన జీవితాన్ని గడిపారని ఆయనను కొనియాడారు. ఎంసిపిఐ(యు)కొండపల్లి ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి కామ్రేడ్ కలకోటి బసవయ్య మాట్లాడుతూ,పార్టీ బేధాలు లేని,నిజాయితీతో కూడిన ప్రజా సేవకు ఆయన ప్రతీక,అని కామ్రేడ్ ఓంకార్ నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి,ప్రజల సమస్యలపై చివరి వరకు పోరాడిన గొప్ప నాయకుడని,కామ్రేడ్ ఓంకార్ గారి శతజయంతి (100వ పుట్టినరోజు) సందర్భంగా ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లిననాడే ఆయనకు మనం అర్పించే ఘనమైన నివాళి అని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఏఐసీటియు నాయకులు కామ్రేడ్స్:పి.శంకర్రావు,వి.శ్రీను, పి.అప్పారావు,మహిళా నాయకురాలు నాగమణి,ఆర్.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# వరుస ఫ్లాపులతో ముందు జాగ్రత్త

## రెమ్యూనరేషన్ భారీగా తగ్గించుకున్న రవితేజ

మాస్ మహారాజా రవితేజ గత కొంతకాలంగా బాక్సాఫీస్ వద్ద సరైన విజయాన్ని అందుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకప్పుడు వరుస హిట్లతో టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక మార్కెట్‌ను సృష్టించుకున్న రవితేజ, ఇప్పుడు వరుస పరాజయాలతో కెరీర్‌లో వైఫల్య దశను ఎదుర్కొంటున్నారు. ఇటీవల విడుదలైన సినిమాలు ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోకపోవడంతో, ఆయన తన తదుపరి ప్రాజెక్టుల విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇప్పటివరకు కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌తో ప్రేక్షకులను అలరించిన రవితేజ, ఇప్పుడు మార్కెట్ పరిస్థితులను బట్టి తన నిర్ణయాల్లో మార్పులు చేస్తున్నారని తెలుస్తోంది. ముఖ్యంగా రెమ్యూనరేషన్ విషయంలో ఆయన తీసుకున్న తాజా నిర్ణయం చిత్రసీమలో హాట్ టాపిక్‌గా మారింది. ఒకప్పుడు సినిమా కోసం రూ.25 కోట్ల వరకు పారితోషికం తీసుకున్న రవితేజ,




ప్రస్తుతం తన రెమ్యూనరేషన్‌ను రూ.15 కోట్లకు తగ్గించుకున్నారని ప్రచారం. నిర్మాతలపై అదనపు భారం పడకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. వరుస డిజాస్టర్ల తర్వాత మార్కెట్‌లో తన స్థాయిని మళ్లీ నిలబెట్టుకోవాలంటే ముందుగా మంచి విజయాన్ని అందుకోవాల్సిన అవసరం ఉందని రవితేజ భావిస్తున్నారట. అందుకే ప్రస్తుతం కథల ఎంపికలో కూడా ఆయన చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ప్రస్తుతం రవితేజ నటిస్తున్న తాజా చిత్రం 'ఇరుముడి' పై ఇండస్ట్రీలో మంచి ఆసక్తి నెలకొంది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా రవితేజ కెరీర్‌లో పూర్తిగా భిన్నమైన ప్రయత్నంగా చెబుతున్నారు. ఇప్పటివరకు ఎక్కువగా మాస్, కామెడీ, యాక్షన్ ఎంటర్‌టైనర్స్ చేసిన రవితేజ, ఈసారి థ్రిల్లర్ జానర్‌ను ఎంచుకోవడం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. 'ఇరుముడి' సినిమా కథ, ట్రీట్‌మెంట్, రవితేజ పాత్ర పూర్తిగా కొత్తగా ఉండబోతున్నాయని సమాచారం. ఈ సినిమా విజయమే ఇప్పుడు ఆయన కెరీర్‌కు చాలా కీలకంగా మారింది. ఒకవేళ ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధిస్తే రవితేజ మళ్లీ ఫామ్‌లోకి రావడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు.. ప్రముఖ సింగర్‌కు జైలు శిక్ష

ప్రముఖ పాప్ సింగర్ బ్రిట్నీ స్పియర్స్ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నేరాన్ని అంగీకరించారు. దక్షిణ కాలిఫోర్నియాలో మార్చిలో ఆమెపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదైన విషయం తెలిసిందే. దీనిపై సోమవారం విచారణ జరగ్గా.. ఆమె నేరాన్ని అంగీకరించారు. దీంతో ఆమెకు వెంచురా కౌంటీ సుపీరియర్ కోర్టు ఒకరోజు జైలు శిక్షతో పాటు కొన్ని నిబంధనలు విధించింది. శిక్షతో పాటు ఆమె భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం చేయకుండా ఉండటానికి కోర్టు పలు కీలక ఆదేశాలు జారీ చేసింది. మూడు నెలల పాటు ప్రభుత్వం నిర్వహించే డ్రంక్ అండ్ డ్రైవ్ అవగాహన కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించింది. ప్రతి వారం థెరపీ సెషన్లకు హాజరుకావాలని, నెలకు రెండుసార్లు తప్పనిసరిగా సైకియాట్రిస్ట్‌ను కలవాలని సూచించింది.



# విడాకుల జాబితాలో మరో నటి

## భర్తను అన్ ఫాలో చేసిన మౌనీరాయ్

నటి మౌనీరాయ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఒక వార్త కొన్ని రోజులుగా నెట్టింట వైరల్ అవుతోంది. భర్త సూరజ్ నంబియార్‌తో ఆమె విడిపోతున్నట్లు నెట్టింట ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ వార్తలకు బలం చేకూర్చేలా ఇన్‌స్టాగ్రామ్‌లో వీరిద్దరూ ఒకరికొకరు అన్‌ఫాలో చేసుకున్నారు. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే మౌనీ రాయ్ తనకు సంబంధించిన విషయాలను పంచుకుంటూ టూర్స్ ఫొటోలను షేర్ చేస్తుంటారు. కొన్ని రోజులుగా భర్తతో ఉన్న ఫొటోలు పోస్ట్ చేయలేదు. మరోవైపు సూరజ్ నంబియార్ ఇన్‌స్టాలో పెళ్లి ఫొటోలు కూడా కనిపించడం లేదు. అలాగే రూమర్స్‌ను ఇద్దరూ ఖండించకపోవడంతో ఈ



అంశం చర్చనీయాంశంగా మారింది. 2022 జనవరిలో తన ప్రియుడు సూరజ్ నంబియార్‌ను మౌనీరాయ్ గోవాలో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. సినిమాల విషయానికొస్తే.. మౌనీరాయ్ 'విశ్వంభర'లో ఓ స్పెషల్ సాంగ్ చేసినట్లు సమాచారం. చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. చిరంజీవి సూపర్ హిట్ సినిమా 'ఖైదీ'లోని రగులుతోంది మొగలిపొద.. పాట రీమేక్‌కు మౌనీరాయ్‌తో కలిసి చిరు మరోసారి మెస్మరైజ్ చేయనున్నట్లు తెలుస్తోంది.



# ప్రియాంకకు గ్లోబల్ వాన్‌గార్డ్ గౌరవం

ఈ మధ్య ఎప్పటికప్పుడు అంతర్జాతీయ వేడుకల్లో ప్రెజెంటర్‌గా రెడ్‌కార్పెట్‌పై హొయలొలికిస్తూ కనిపిస్తున్నారు బాలీవుడ్ అందాల తార ప్రియాంక చోప్రా. ఇప్పుడదే ప్రపంచ వేదికపై ప్రతిష్మాత్మకంగా భావించే గ్లోబల్ వాన్‌గార్డ్ ఆనర్ పురస్కారాన్ని ఆమె అందుకున్నారు. ఈ విషయాన్ని ప్రియాంక ఇన్‌స్టా వేదికగా పంచుకున్నారు. "ఈ గౌరవంతో పాటు ఇక్కడ ఉన్న సమూహంలో నేను భాగమయ్యాననే అనుభూతిని కలిగించినందుకు గోల్డెన్ హౌస్ వారికి ధన్యవాదాలు. ఇప్పటి వరకు నా ప్రయాణంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞురాలిని"అనే క్యాప్షన్‌ని పేర్కొన్నారు. ఇటీవల లాస్ ఏంజెలెస్‌లోని మ్యూజిక్ సెంటర్‌లో జరిగిన గోల్డ్ హౌస్ అయిదవ ఎడిషన్ గోల్డ్ గాలాకు ఆమె హాజరయ్యారు. ఆసియా పసిఫిక్‌తో పాటు పాశ్చాత్య వినోద రంగంలో సంస్కృతులను అనుసంధానించడంలో గణనీయమైన కృషి చేసినందుకుగానూ.. ప్రియాంక 25 ఏళ్ల కెరీర్‌ని గుర్తిస్తూ ఈ పురస్కారం ఆమెను వరించింది. ప్రపంచవ్యాప్తంగా ఆసియా పసిఫిక్ ప్రాంతానికి చెందిన సంస్కృతి, వినోదంతో కూడిన పలు రంగాలలో అత్యంత ప్రభావవంతులైన వంద మందిని సత్కరించే వేడుక గోల్డ్ గాలా. ఈ ఏడాది 'ఏ న్యూ గోల్డ్ వరల్డ్' అనే థీమ్‌తో జరిగింది. ఇటీవలే 'సిటాడెల్ 2'లో కనిపించారు ప్రియాంక. ప్రస్తుతం దర్శకుడు రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి' చిత్రంతో బిజీగా ఉన్నారు.

# కమల్-రజనీ మూవీలో త్రిష



తమిళనాడులో ఎన్నికల సందడి మొదలు... గత కొన్ని రోజులుగా త్రిష పేరు మార్మోగిపోతోంది. ముఖ్యమంత్రిగా తమిళ సూపర్‌స్టార్ విజయ్ ప్రమాణ స్వీకారోత్సవంలోనూ త్రిష ప్రధాన ఆకర్షణగా నిలిచారు. తమిళనాడు రాజకీయాల్లోకి ఆమె కూడా ప్రవేశిస్తారన్న ప్రచారం సామాజిక మాధ్యమాల్లో మొదలైంది. అయితే ఆమె వరుస సినిమాలతో సందడి చేయబోతోంది. మరోవైపు కొత్త ప్రాజెక్టుల విషయంలోనూ ఆమె పేరు బలంగా వినిపిస్తోంది. రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి చేయనున్న సినిమాలోనూ త్రిష కథానాయికగా నటించనున్నట్టు సమాచారం. నాలుగున్నర దశాబ్దాల తర్వాత రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆ సినిమాలోనే త్రిష ఓ కథానాయికగా నటించనున్నట్టు తెలుస్తోంది. అదే నిజమైతే ఈ కలయిక మరింత ప్రత్యేకం కానుంది. దీనిపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన అనంతరం ఇన్‌స్టాలో ఓ పోస్ట్‌ని పంచుకున్నారు త్రిష. ప్రేమ ఎప్పుడూ గట్టిగానే వినిపిస్తుంది... అనే వ్యాఖ్యని జోడిస్తూ, తన ముస్తాబు వెనకున్న తన బృందానికి కృతజ్ఞతలు చెప్పింది.

# శ్రీనివాస మంగాపురం సెకండ్ సింగిల్ ప్రోమో

మంగళవారం సినిమా హిట్ తరువాత అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తోన్న చిత్రాల్లో శ్రీనివాస మంగాపురం ఒకటి. ఘట్టమనేని వారసుడు జయకృష్ణ హీరోగా పరిచయమవుతోన్న ఈ చిత్రంలో బాలీవుడ్ భామ రవీనా టాండన్ కుమార్తె రషా తడానీ హీరోయిన్ గా నటిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, సాంగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సినిమాను వైజయంతీ మూవీస్ బ్యానర్ పై అశ్వినీదత్ సమర్పించడం మరింత బజ్ ని క్రియేట్ చేసింది. తాజాగా శ్రీనివాస మంగాపురం నుంచి సెకండ్ సింగిల్ ప్రోమోను మేకర్స్ రిలీజ్ చేశారు. మంగా మంగా అంటూ సాగే ఈ సాంగ్ ఆద్యంతం ఆకట్టు కొంటుంది. తిరుపతిలో జరిగే ప్రేమకథగా శ్రీనివాస మంగాపురం తెరకెక్కుతోంది. కొత్తగా తిరుపతి కొచ్చిన కుర్రోళ్ళని బతకనివ్వరా..? అన్నదమ్ములు లేరా మీకు? అంటూ హీరో.. హీరోయిన్ అందాన్ని చూసి మైమరచిపోయి.. ఆమెపై ఉన్న ప్రేమ భావాలను తెలిపుతున్నట్లు లిరిక్స్ వింటుంటే అర్థమవుతోంది.జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించిన ఈ సాంగ్ కి కాసర్ల శ్యామ్ లిరిక్స్ అందించాడు. ఇక రేవంత్ తన వాయిస్ తో ఈ సాంగ్ ని నెక్ట్స్ లెవెల్ కి తీసుకెళ్లాడు. జయకృష్ణ క్యూట్ స్టెప్స్, మాస్ లుక్, రషా అందం, విజువల్స్ అదిరిపోయాయి. మే 13 న ఫుల్ సాంగ్ ను రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం షూటింగ్ జరుపుకొంటున్న ఈ చిత్రం త్వరలోనే రిలీజ్ కి సిద్ధమవుతోంది.




Printed, Published & Owned by Boda prakash s/o krishna h.no 3-2 satyanarayana puram Edulapuram khammam rural Telanagana 507003 , Printed at Maddineni Nageshwara Rao , H.NO 1-17 18 , Svn Colony, Edulapuram, khammam rural Telanagana 507003, EDITOR : Boda prakash PH : 9000005078 & 9133935333 , RNI. NO TGTEL/26/A0372. EMAIL: manamahati@gmail.com